ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 20 సెప్టెంబరు 2025

కోటబొమ్మాళి ఏఎంసీ సభ్యుల నియామకం

శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ సహకారశాఖ ఉత్తర్వుల మేరకు కమిటీలో గౌరవాధ్యక్షుడిగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవహరిస్తారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా బగాది శేషగిరిరావు, ఉపాధ్యక్షురాలిగా బి.వెంకట రమణమ్మ నియమితులయ్యారు. సభ్యులుగా కె.రామిరెడ్డి, కె.ధర్మారావు, టి.సింహాద్రినాయుడు, జె.రామ్‌జీ, ఎస్.ధనరాజు, ఎన్.నాగరాజు, ఎల్.సుజాత, (మిగతా 6వ పేజీలో..)


● వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ గ్రామంలో 20 ఏళ్ల యువతికి కొన్నాళ్ల కిందట విపరీతమైన జ్వరం రాగా.. స్థానిక ఆర్ఎంపీని సంప్రదించింది. ఆయన ఇచ్చిన మందులు వేసుకున్న తర్వాత జ్వరం తగ్గుముఖం పట్టింది. కానీ కొన్నిరోజుల తర్వాత మళ్లీ జ్వరం రాగా.. ఆర్ఎంపీ వైద్యుడిని మరోసారి సంప్రదించి మందులు వాడింది. ఇలా.. తరచూ జ్వరం రావడంతో ఆమెను కాశీబుగ్గలోని ఎమ్‌డీ వైద్యుడి వద్దకు వెళ్లాలని ఆర్ఎంపీ సూచించారు. ఆయన వైద్యపరీక్షలు చేయగా.. ఆ యువతికి బ్లడ్‌క్యాన్సర్ తుది దశలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే మందులు వాడినా ఫలితం లేకపోయింది. ఆమె 15 రోజుల వ్యవధిలోనే మృతి చెందింది.

● ఇదే మండలంలోని మరో గ్రామంలో కూలి చేస్తూ జీవించే 55 ఏళ్ల మహిళకు కడుపులో కణితి ఏర్పడింది. కొన్నాళ్ల కిందట ఆమె వైద్యుల వద్దకు వెళ్లగా ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. అలాగే వైద్యపరీక్షల్లో ఆమెకు క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారించారు. వెంటనే ఆమెను వైజాగ్ క్యాన్సర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రెండు నెలలపాటు ఆమె చికిత్స పొంది తిరిగి గ్రామానికి చేరుకుంది. కానీ కొన్నిరోజుల తర్వాత క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతూ మృతి చెందింది.

● తీర ప్రాంతంలోని ఓ సీనియర్ ఏఎస్ఎం కూడా ఇటీవల క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతూ మృతి చెందింది. ఈమెకు వైద్యం కోసం సుమారు రూ.90 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు వాపోయారు.

● తీరప్రాంత గ్రామంలోని మరో మహిళకు కడుపులో కణితి ఉంది. ముందుగా దీనిని గుర్తించకపోవడంతో క్యాన్సర్ వ్యాధి తీవ్రత పెరిగింది. ప్రస్తుతం 15 రోజులకోసారి వైజాగ్‌లో ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నానని.. ఒకసారికి రూ.40వేల వరకు ఖర్చవుతోందని ఆమె వాపోతుంది. ఓ వైపు క్యాన్సర్ కారణంగా.. మరోవైపు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వమే తమలాంటి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.

అమ్మో.. క్యాన్సర్



● తీరప్రాంత గ్రామాల్లో పెరుగుతున్న బాధితులు

● భయాందోళనలో ప్రజలు

● మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లే కారణం

● అవగాహనతోనే వ్యాధి నియంత్రణ సాధ్యం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు. ప్రధానంగా తీరప్రాంత గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోంది. ఇప్పటికే తీరప్రాంతవాసులు కిడ్నీవ్యాధితో సతమతమవుతున్నారు. తాజాగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కూడా కొంతమందిలో బయటపడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, నిరంతర ఒత్తిడి కారణంగా గ్రామాల్లోనూ క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రపంచంలో చైనా తర్వాత రెండో స్థానం ఇండియాలో క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్నట్టు నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రాం పరిశోధనలో వెల్లడైంది. ప్రతి పది మందిలో ఒకరు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. 2022లో భారతదేశంలో 20 మిలియన్ల మంది క్యాన్సర్ బాధితులు ఉండగా, 2050 నాటికి 35 మిలియన్ల మందికి చేరుకుంటారని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. రాష్ట్రంలో ఏటా 75వేల మంది వరకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయని, అందులో 30 వేల మంది మృతి చెందుతున్నట్టు గతేడాది రాష్ట్రప్రభుత్వం వెల్లడించింది. జిల్లాలో కూడా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో మహిళలో అత్యధికంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయని పేర్కొంటున్నారు. క్యాన్సర్ వచ్చేముందు అసాధారణంగా బరువు తగ్గడం, అలసట, ఒళ్లునొప్పులు, దగ్గు (మిగతా 6వ పేజీలో..)



విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ఎన్టీఆర్ మునిసిపల్ పాఠశాలను దత్తత తీసుకుంటా

● పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

● విద్యార్థులతో ముఖాముఖి ● సమస్యల పరిష్కారానికి ఆదేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'శ్రీకాకుళంలో ఎంతో చరిత్ర కలిగిన పురాతనమైన ఎన్టీఆర్ మునిసిపల్ పాఠశాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఈ పాఠశాలను దత్తత తీసుకుంటా. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా'నని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్ మునిసిపల్ పాఠశాలలో ఎంపీ ల్యాడ్స్ రూ.50లక్షలతో నిర్మిస్తున్న తిలక్ హాల్ పనులను ఆయన పరిశీలించారు. హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా సమకూర్చి, త్వరలోనే దానిని పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ముఖాముఖిలో భాగంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి.. సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చక్కని (మిగతా 6వ పేజీలో..)

ఆ మార్గానికి.. మోక్షమెప్పుడో?

● ఆరులేన్ల జాతీయ రహదారి ఏర్పాటుపై ఆశలు గల్లంతు

● నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు విస్తరణకు తప్పని నిరీక్షణ

టెక్కలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేట వరకు ఆరులేన్ల జాతీయ రహదారి ఏర్పాటు ప్రతిపాదనకు మోక్షం లభించడం లేదు. జిల్లా సరిహద్దు పైడిభీమవరం నుంచి నరసన్నపేట సమీపాన జమ్ము జంక్షన్ వరకు సుమారు 180 కిలోమీటర్ల మేర ఆరులేన్ల జాతీయ రహదారి విస్తరించి ఉంది. కాగా జమ్ము జంక్షన్ నుంచి ఇచ్ఛాపురం వరకు సుమారు 126 కిలోమీటర్లు.. నాలుగు లేన్ల జాతీయ రహదారికే పరిమితమైంది. దీంతో ఈ మార్గాన్ని ఆరులేన్లుగా విస్తరించాలని ఈ ప్రాంతవాసులు ఎన్నాళ్ల నుంచో విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వానికి సంబంధిత మంత్రిత్వశాఖ అనుమతి లభించడం లేదు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ అనుకూలత లేదనే కారణంతో ఆరులేన్ల విస్తరణకు అనుమతి లభించడం లేదు. వాస్తవానికి పలాస టోల్‌గేట్ లెక్కల ప్రకారం రోజుకు సుమారు 6వేల వాహనాలు జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే పూర్తిస్థాయిలో ఆరులేన్ల జాతీయరహదారి లేకపోవడం జిల్లా ప్రజలకు శాపంగా మారింది. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుపై ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజానీకం ఆరులేన్ల రహదారి మంజూరు కోసం కృషి చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.

● జిల్లాలో పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకు నాగావళి, వంశధార నదులపై పెద్దపెద్ద వంతెనలు సైతం పూర్తయ్యాయి. మందస మండలం పరిధిలో జాతీయ రహదారిపై మహేంద్రతనయ, ఇచ్ఛాపురం సమీపంలో బాహుదా నదులపై కూడా వంతెనలు నిర్మించారు. నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయరహదారిపై వంతెనలు, ఫ్లైఓవర్లు, బైపాస్ రోడ్లు, సర్వీస్ రోడ్లు, రైల్వే క్రాసింగ్స్ వద్ద ఎన్‌హెచ్ఏఐ యంత్రాంగం పూర్తిచేసింది. టెక్కలి (మిగతా 6వ పేజీలో..)

టెక్కలి సమీపంలో నాలుగు లేన్ల జాతీయ రహదారి





కొత్తమ్మతల్లి ఉత్సవాలకు సిద్ధం కావాలి

● భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సరియాపల్లిలో అపరిశుభ్రత

● అధ్వానంగా రహదారులు

● కానరాని డ్రైనేజీలు

● తప్పని తాగునీటి అవస్థలు

● పట్టించుకోని అధికారులు

ఆ వివాహిత చనిపోయింది

● భర్త దూరమవుతున్నాడని.. పురుగుల మందు తాగిన మహిళ

● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి 8లో

నేలకు ఆరోగ్యం.. రైతుకు మేలు

● జీవన ఎరువులు, ప్రకృతి విధానం ఎంతో ఉపయోగం

● ఖర్చు తగ్గి.. దిగుబడి పెరిగే అవకాశం

● రసాయన ఎరువులతో మట్టి సారం కోల్పోతున్న వైనం 6లో

సమస్యలు పరిష్కరించండి

● అసెంబ్లీలో గళమెత్తిన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు

● వంశధార నుంచి శివారు భూములకు నీరివ్వాలి: గౌతు శిరీష

● సీఐడీ విచారణకు ఆదేశించాలి: కూన రవికుమార్

పకడ్బందీగా పెట్రోలింగ్ గస్తీ

● 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ మహేశ్వరరెడ్డి 7లో

'వాహన మిత్ర'కు సర్వర్ సమస్య

● దరఖాస్తుకు నేటితో గడువు సరి



సర్వర్ పనిచేయక ఆటోడ్రైవర్ల నిరీక్షణ

టెక్కలి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'వాహనమిత్ర' పథకానికి సంబంధించి దరఖాస్తుల నమోదుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద రూ.15వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు సాగుతోంది. కాగా, సాంకేతిక సమస్యలు కారణంగా ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు గంటలపాటు నిరీక్షించారు. ఒక్కో సచివాలయంలో రోజు మూడు, నాలుగు దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ అవుతున్నాయని సచివాలయ సిబ్బంది తెలిపారు. శుక్రవారం ఆఖరిరోజు కావడంతో దరఖాస్తుల నమోదు పూర్తికాక చాలామంది ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒకరోజు గడువు పెంచింది. శనివారం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేయడంతో ఆటోడ్రైవర్లు ఊరట చెందారు. సాంకేతిక సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నిఘా ఏం చేస్తోంది?

● జిల్లాలో యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

● రాత్రివేళ ఇతర ప్రాంతాలకు తరలింపు

● కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ



● ఈ నెల 17న నరసన్నపేట మండలం గోపాలపెంట వద్ద లారీలో అకేసు కలపను అక్రమంగా తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నదీ తీర ప్రాంతాల్లో గల అకేసు చెట్లు కొందరు నరికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో టెక్కలి రేంజర్ జగదీష్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గోపాలపెంట నుంచి ఎచ్చెర్ల వద్ద లోడింగ్ పాయింట్‌కు ఆ కలప తరలిస్తున్నట్టు గుర్తించి.. లారీని సీజ్ చేశారు.

● వజ్రపుకొత్తూరు మండలంలోని బాతుపురం-చినవంక మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను కూడా అక్రమార్కులు వదలడం లేదు. ఆర్అండ్‌బీ అధికారుల అనుమతి లేకుండానే కొంతమంది వ్యక్తులు రాత్రివేళ ఈ చెట్లను నరికేసి.. అక్రమ రవాణా సాగిస్తున్నారు.

నరసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పచ్చనిచెట్లపై అక్రమార్కుల గొడ్డలివేటు పడుతోంది. తీరప్రాంత గ్రామాల్లో సరుగుడు, నీలగిరితోపాటు అకేసు, టేకు తదితర మొక్కలు పెంచుతున్నారు. పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నరసన్నపేట, లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, ఆమదాలవలస తదితర మండలాల్లో మెట్టు ప్రాంతాల్లో అధికంగా నీలగిరి సాగు చేస్తున్నారు. కాగా.. నీలగిరి, సరుగుడు కలప మాటున టేకు, అకేశ్ కర్రలు లారీల్లో లోడ్ చేసి రాత్రివేళ ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. జిల్లాలో పలు వేబ్రిడ్జిల వద్ద కలప అక్రమ విక్రయాలు చేపడుతున్నారు. నీలగిరి కలప టన్ను రూ.5వేల వరకు, సరుగుడు కలప టన్ను రూ.12వేల వరకు విక్రయిస్తున్నారు.

● ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాల్లో జాతీయ రహదారి పక్కనే పలు ప్రాంతాల్లో నీలగిరి తొక్కతీసి చిన్న దుంగలుగా కట్ చేసి ఉంచుతారు. వీటిని ప్లేవుడ్ తయారీ కోసం పశ్చిమబెంగాల్‌కు ఎక్కువగా ఎగుమతి చేస్తారు. రోజుకు సుమారు పది లారీల కలప జిల్లా నుంచి ఎగుమతి చేస్తున్నారు. అలాగే సారవకోట, పాతపట్నం, హిరమండలం, ఎల్.ఎన్.పేట, మెళియపుట్టి, మందస, టెక్కలి తదితర మండలాల్లో కొండ ప్రాంతాల నుంచి విలువైన కలప రాత్రి సమయంలో అక్రమంగా తరలిపోతోంది. టేకు, మద్ది తదితర రకాల కలపను వ్యాపారులు.. రైతులు, గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అటవీశాఖ అధికారుల కన్నుసన్నల్లోనే గిరి ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా మైదాన ప్రాంతాలకు దిగుమతి చేస్తున్నారు. వీటిని జిల్లాలో కొన్ని టింబర్ డిపోలకు రవాణా చేయగా, మరికొందరు వ్యాపారులు తమ ఇళ్ల, కళ్లాలు వద్ద నిల్వ చేస్తున్నారు. వేసవిలో వీటిని బయటకు తీసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.



పోలాకి మండలం నుంచి రాత్రివేళ లారీలో కలప అక్రమ రవాణా

టేకుకు ప్రత్యామ్నాయంగా అకేసు

టేకు ధర ఎక్కువగా ఉండటంతో ఇంచుమించు టేకును పోలిన అకేసుకు డిమాండ్ పెరిగింది. టేకు అడుగు ధర రూ.3వేలు ఉండగా.. అకేసు అడుగు ధర రూ.1500 పలుకుతోంది. చాలా మంది టేకుకు ప్రత్యామ్నాయంగా అకేసును వినియోగిస్తున్నారు. అకేసు చెట్లు ఇసుక నేలల్లో అధికంగా పెరుగుతాయి. నదీ తీర గ్రామాల్లో సాగుచేస్తున్న వారికి అకేసు చెట్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి.. వాటిని కలప పేరుతో అక్రమ రవాణా సాగిస్తున్నారు.

అటవీశాఖ కనుసన్నల్లో...

జిల్లాలో కలప అక్రమ రవాణా కొంతమంది అటవీశాఖ అధికారులు కన్నుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కుల దగ్గర మామూళ్లు (మిగతా 6వ పేజీలో..)

బీఆర్ఏయూకు గ్రీన్ ఆడిట్ గుర్తింపు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి మొదటిసారిగా గ్రీన్‌ఆడిట్ గుర్తింపు లభించింది. జీసీ కన్సల్టెన్సీ సర్వీసెస్(గోరఖ్‌పూర్-ఉత్తరప్రదేశ్) ఈ గుర్తింపునిస్తూ వర్సిటీకి సమాచారం అందించింది. జీసీ కన్సల్టెన్సీ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ విశాల్ శ్రీ వాత్సవ్ నేతృత్వంలో బృందం ఈ ఏడాది జూలై 22,23 తేదీల్లో వర్సిటీలో పర్యటించింది. బోధన, పరిపాలన, పరిశోధన, సేవలు, సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణకు వర్సిటీ తీసుకుంటున్న చర్యలను ప్రశంసిస్తూ గ్రీన్ ఆడిట్ యూనివర్సిటీగా గుర్తింపు కల్పించింది. ఇందుకు కృషి చేసిన ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డి తిరుపతిరావు, సభ్యులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్, డాక్టర్ జి.కిరణ్‌కుమార్, డాక్టర్ పి.మాధవరావును శుక్రవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు పాల్గొన్నారు.



గ్రీన్ ఆడిట్ గుర్తింపు పత్రాన్ని చూపిస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తదితరులు

నేలకు ఆరోగ్యం.. రైతుకు మేలు



- జీవన ఎరువులు, ప్రకృతి విధానం ఎంతో ఉపయోగం
- రసాయన ఎరువులతో మట్టి సారం కోల్పోతున్న వైనం

నరసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇంత కష్టపడి యూరియా బస్తా సంపాదించినా పంటకు జరిగిన మేలు కంటే అనర్థాలే ఎక్కువని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో తెగుళ్ల పెరగడంతో పాటు ఆ విషపూరిత ఉత్పత్తులు తినడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందంటున్నారు. అదే ప్రకృతి, జీవన ఎరువుల వినియోగం వల్ల నేల కూడా ఆరోగ్యంగా ఉంటుంది. వీటిపై రైతుల్లో చైతన్యం పెరగాల్సిన అవసరముందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. యూరియాతో పాటు మిగిలిన రసాయన ఎరువుల వాడకం వల్ల మట్టిసారం కోల్పోతోందని శాస్త్రవేత్తల అధ్యయనంలో గుర్తించారు.

యూరియా వల్ల భూమి నిస్సారమై..

సాధారణ యూరియా 45 కేజీలు బస్తా 267 రూపాయలకు సబ్సిడీతో ప్రభుత్వ అందజేస్తోంది. వీటికి రవాణా ఖర్చులు అదనం. ఎకరాకు రెండు నుంచి నాలుగు బస్తాలు అవసరం. 35 శాతం నత్రజని మాత్రమే పంటకు అందుతుంది. మిగిలినది ఆవిరై పోతుంది. దీని పనితనం రెండు రోజులు ఉంటుంది. వేర్ల నుంచి ఆకులకు పంటపై భాగాలకు నత్రజని తక్కువగా చేరుతుంది. రెండు మూడు నెలలు తర్వాత గడ్డ కట్టే అవకాశం ఎక్కువ. ఎరువుల కంపెనీల్లో యూరియా ఉత్పత్తికి అంతరాయం కలిగితే కొరత ఏర్పడుతుంది. ప్రతి యూరియా బస్తాకు రూ.1970 కంపెనీకి రాయితీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది.

- యూరియాను అవసరానికి మించి వాడితే భూమినిస్సారం అవుతుంది. మొక్కలు పెలుసు బారి చీడపీడలు పెరుగుతాయి.
- నెలలో ఉండే పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు తగ్గిపోతాయి.
- యూరియా ఆమ్లస్వభావం కలిగి ఉంటుంది. దీంతో భూమి ఆమ్లనేలలగా మారుతాయి.
- యూరియా వేసిన తర్వాత పంటలకు 30నుంచి 35 శాతం వరకే మొక్కలకు అందుతుంది. మిగతాది గాలిలోకి ఆవిరి రూపంలో భూపోర, భూగర్భజలాల్లో కలిసి పోతుంది.



ప్రకృతి వ్యవసాయం విధానంలో ద్రవజీవామృతం తయారు చేస్తున్న రైతులు

ప్రకృతి, జీవన ఎరువులతో దిగుబడి పెరిగి.. ఖర్చు తగ్గి

వేరుశనగ పిండి, వేప పిండి, ఆముదం పిండి, చెరకు మడ్డి, వర్మీ కంపోస్టు జీవన ఎరువులు కిందకు వస్తాయి. గాలిలో నత్రజని 78 శాతం ఉంది. అంటే యూరియాలో ఉండే నత్రజని కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ. ఈ నత్రజనిని మొక్కలు తమంత తాము వినియోగించుకోలేవు. కొన్ని సూక్ష్మజీవులు, నాచు రకాలు గాలిలో నత్రజనిని గ్రహించి మొక్కలకు అందజేస్తాయి. నేలలో ఉండి కూడా మొక్కలకు లభ్యం కాని విధంగా భాస్వరం లభిస్తుంది. దీన్ని మొక్కలకు అందేలా చేయడానికి కొన్ని సూక్ష్మజీవులు, శిలీంద్రాలు ఉన్నాయి. జీవన ఎరువులు వినియోగం వల్ల భూమి భౌతిక స్వరూపం అభివృద్ధి చెందుతుంది. భూమిలో నిల్వచేసే గుణం ఎక్కువగా ఉంటుంది. జీవన ఎరువులు రెండు రకాలు. ఒకటినత్రజని నిల్వ చేసేవి, రెండోది భాస్వరాన్ని కరిగించేవి.

- ఇవి ప్రకృతిలో ఉన్న నత్రజని, భాస్వరాన్ని గ్రహించి మొక్కలకు అందజేస్తాయి. మొక్క పెరుగుదలకు అవసరమైన హార్మోనులు, విటమిన్లు, ఎంజైములు ఇస్తాయి. 20 నుంచి 25శాతం వరకూ నత్రజని, భాస్వరం ఎరువులు తగ్గించవచ్చు. 10 నుంచి 20 శాతం దిగుబడులు పెరుగుతాయి. భూసారం పెరుగుతుంది. నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను, వాతావరణ కాలుష్యం నివారించవచ్చు. దిగుబడుల్లో నాణ్యత, రుచి పెరుగుతుంది.
- యూరియాలో 90శాతానికి పైగా నత్రజని ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభించే జీవన ఎరువులు వినియోగించవచ్చని వ్యవసాయ నిపుణులు, అధికారులు చెబుతున్నారు. రైజోబియం, అజటోబాక్టర్, అజస్పైరిల్లం, అజోలా, నీటి ఆకుపచ్చ నాచు వంటి జీవన ఎరువులు వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు. భాస్వరం, పొటాష్‌కు బదులు ప్రకృతి సాగు విధానంలో ఘన జీవనామృతం, ద్రవజీవామృతం వినియోగించుకోవచ్చు. వీటిని ఆవుపేడ, ఆవు మూత్రంతో తయారు చేస్తారు. ఈ విధానాన్ని జిల్లాలో కొందరు రైతులు ఆచరిస్తున్నారు. వీటితో పాటు పలు రకాల ఆకుల కషాయాలను కూడా పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించుకోవచ్చని చెబుతున్నారు.

ప్రకృతిసాగుపై అవగాహన కల్పిస్తున్నారా?

జిల్లాలో ప్రకృతి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం జిల్లాలో ఓ శాఖ ఉంది. ప్రతి మండలానికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా ఉన్నారు. అయితే రైతులను చైతన్యపర్చి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంలో ఈ శాఖ కాస్త వెనుకబడిందన్న విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల శిక్షణ ఇస్తున్నా రైతులే ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ప్రకృతి విధానాలను ప్రోత్సహించాలి



యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు చూస్తున్నాం. కానీ జీవన ఎరువుల వినియోగించే రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా సాగు చేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం విధానాలను మరింత ప్రోత్సహించడంతోపాటు ప్రత్యేక రాయితీలు కూడా కల్పించాలి. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, మీనామృతం వంటివి మొక్కలకు నత్రజనిని అందించడంలో కీలకంగా పనిచేస్తాయి.

-రావాడ మోహనరావు, నరసన్నపేట

అమ్మో.. క్యాన్సర్

(ఐదో పేజీ తరువాయి)

గొంతు సమస్యలు, చర్మంలో మార్పులు, గడ్డలు పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు. అప్రమత్తంగా వ్యవహరించి.. సకాలంలో మందులు వాడాలని సూచిస్తున్నారు. మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి.. చికిత్స తీసుకుంటే ఫలితం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. కాగా.. అవగాహన లేక చాలామంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సమయానికి పరీక్షలు చేసుకోవాలి..

క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడం చాలా ముఖ్యం. అవగాహన, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకుంటే ఈ వ్యాధి రిస్క్‌ను తగ్గించవచ్చు. రిస్క్ ఉన్నవారు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చు. కుటుంబం ఎవరికైనా క్యాన్సర్ వస్తే.. మిగిలిన కుటుంబ సభ్యులు మ్యూటిషన్ టెస్ట్ చేయించుకోవడం మంచిది.

-డాక్టర్ కోదండరావు, పూండి

అవగాహన కల్పించాలి..

క్యాన్సర్ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ప్రజలు జంక్‌ఫుడ్‌కు, మద్యం, ధూమపానం, గుట్కా వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. నిరంతరం వైద్యపరీక్షలు చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించుకోవాలి.

- ముంజేటి పాపారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్

గ్రామాల్లో బాధితులు పెరుగుతున్నారు..

గ్రామాల్లో గతం కంటే క్యాన్సర్ వ్యాధులు అధికంగా బయటపడుతున్నాయి. పచ్చని వాతావరణంలో జీవనం సాగిస్తూన్నా ఆహారపు అలవాట్లలో మార్పు కారణంగా క్యాన్సర్ లక్షణాలు ప్రబలుతున్నాయి. ఓవైపు కిడీవ్యాధి, మరోవైపు క్యాన్సర్‌తో తీర ప్రాంతవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కొంతమంది వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నా బయటకు చెప్పుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. చేస్తోంది. ప్రభుత్వం స్పందించి క్యాన్సర్ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి.

- పురుషోత్తం అక్కుపల్లి, శ్రీరామసేవా సంఘం మాజీ అధ్యక్షుడు

నిఘా ఏం చేస్తోంది?

(ఐదో పేజీ తరువాయి)

తీసుకుని కలప అక్రమ రవాణాను చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టాస్క్‌ఫోర్స్ జిల్లాలో తిరిగే సమయంలో కలప అక్రమ వ్యాపారం చేసేవారికి అటవీశాఖ అధికారులే సమాచారం ఇస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరిగితే నామమాత్రంగానే దాడులు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో ప్రసన్న వద్ద ప్రస్తావించగా.. కలప అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనుమతి లేకుండా కలప అక్రమ రవాణా చేస్తే అపరాధ రుసుం విధిస్తున్నామన్నాని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



పార్కు సుందరీకరణకు అధికారులకు సూచనలిస్తున్న కేంద్రమంత్రి

అరసవల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. శుక్రవారం శ్రీకాకుళంలోని కాకివీధి, మోనంగివారి తోట సచివాలయం, కామాక్షి కాలనీల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, మెదడు వాపు వ్యాధి, చికెన్‌గున్యా, డెంగ్యూ, బోదవ్యాధి వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. నీరు నిల్వ లేకుండా, పరిసరాల్లో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిచ్చి మొక్కలు ఉంటే తొలగించాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, మలేరియా అధికారి సత్యనారాయణ, సుడా ఈఈ పొగిరి సుగుణాకరరావు, మునిసిపల్ సిబ్బంది, యూపీ హెచ్‌సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతాం..

కార్గిల్ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని ఏపీహెచ్‌బీకాలనీలో గల కార్గిల్ విక్టరీ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల నుంచి పార్కు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కు నిర్వహణ సరిగా లేదని, ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్, వాకింగ్ ట్రాక్ పూర్తిగా పాడయ్యాయని, పిల్లలు ఆడుకోవడానికి కూడా ఇబ్బందిపడుతున్నారని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక పోవడంతో పార్కులో నీరు నిలిచిపోతోందని స్థానికులు మంత్రికి వివరించారు.వెంటనే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో మంత్రి మాట్లాడి సుడా నిధుల నుంచి బ్యూటిఫికేషన్, చిల్డ్రన్స్ పార్కు, రీడింగ్ రూమ్, కార్గిల్ థీమ్‌తో జవాన్ బొమ్మలతో కూడిన విగ్రహాలను నెలకొల్పాలని ఆదేశించారు. పదిహేను రోజుల్లోగా పార్కు సుందరీకరణకు సంబంధించి డిజైన్లు పూర్తి చేయాలన్నారు.

దివ్యాంగుల నుంచి వినతుల స్వీకరణ..

శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగుల కోసం స్వాభిమాన్ కార్యక్రమం పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దివ్యాంగుల నుంచి వినతులను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గతంలో దివ్యాంగులు వారి సమస్యల పరిష్కారం కోసం పడుతున్న కష్టాలను చూసి కేంద్రమంత్రి గత ఏడాది ఆగస్టు మూడో శుక్రవారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆయన 40 మంది నుంచి వినతులను స్వీకరించారు. ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, అవసరమైన వారికి హ్యాండ్ స్టిక్కులు, వినికిడి యంత్రాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి అందజేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా పాల్గొన్నారు.

ఆ మార్గానికి.. మోక్షమెప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

సమీపంలో రూ.4,624కోట్లతో మూలపేట పోర్టు శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. దీంతో ఈ ప్రాంతంలో ఆరులేన్ల రహదారి నిర్మాణం కచ్చితంగా జరుగుతుందని అంతా భావించారు. కాగా జాతీయ రహదారికి, పోర్టు రోడ్లు కనెక్టింగ్ అయిన చోట కొత్త స్ట్రక్చర్ల మంజూరుకు ఎన్‌హెచ్‌ఏఐ యంత్రాంగం అంగీకరించినట్లు తెలుస్తోంది. కానీ ఆరులేన్ల రహదారి నిర్మాణం ఊసెత్తడం లేదని జిల్లావాసులు నిరాశ చెందుతున్నారు.

ట్రాఫిక్ చాలడం లేదు..

నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు ఎన్‌హెచ్16లో ట్రాఫిక్ చాలడం లేదు. నరసన్నపేట నుంచి ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు వయా చల్లపేట వాహనాలు వెళ్తూ ఉన్నాయి. అందువలనే కేంద్ర ప్రభుత్వం ట్రాఫిక్ చాలదనే కారణంతో ఆరులేన్ల విస్తరణకు ముందుకు రావడం లేదు. అయినప్పటికీ ఆరులేన్ల రహదారి విస్తరణ కోసం నావంతు కృషి చేస్తున్నాను.

-కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్రమంత్రి

సమస్యలు పరిష్కరించండి

- అసెంబ్లీలో గళమెత్తిన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు

శాసనసభ సమావేశాల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు సమస్యలపై గళం వినిపించారు. శుక్రవారం ఆయా నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. జిల్లాలో సమస్యలు పరిష్కరించాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత మంత్రులను కోరారు.

వంశధార నుంచి శివారు భూములకు నీరివ్వాలి

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా ప్రాజెక్టు నుంచి సీఎం చంద్రబాబు ఏ రీతిన కుప్పం, నంద్యాల ప్రాంతాలకు సాగునీరు అందించారో.. అదే రీతిన వంశధార నుంచి శివారు భూములకు నీరిచ్చేలా చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శాసనసభలో ఆమె శ్రీకాకుళం జిల్లాలో సాగునీటి రంగంపై ఉన్న సమస్యలను ప్రస్తావించారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, నరసన్న పేట, పలాస నియోజకవర్గాలకు సాగునీరు అందాల్సిఉందని చెప్పారు. కాలువలో 2,480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తేనే శివారు భూములకు సైతం నీరందుతుందని, కానీ ప్రస్తుతం 1400 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవాహం ఉంటోందని తెలిపారు. 2009లో విజిలెన్స్ విచారణ, 2012లో వంశధార షట్టర్ల అంశంపై సీఐడీ కేసు వల్ల షట్టర్ల ఏర్పాటుచేయకపోవడం, కాలువలను ఆధునికీకరించకపోవడంతో పలాస నియోజకవర్గానికి సాగునీరందడంలేదని తెలిపారు. వంశధార ఎడమ ప్రధాన కాలువకు కనీసం రూ.200 కోట్లు వెచ్చిస్తే పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో ఆయకట్టుకు సాగు నీరందుతుందని చెప్పారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూ. 120 కోట్లు కేటాయించినా డిస్ట్రిబ్యూషన్ కోసం టెండర్ల ప్రక్రియ ప్రారంభంకాలేదని, దీనిని వేగవంతం చేయాలని కోరారు. మందస మండలంలోని కళింగదల్-దామోదరసాగర్-డబారుసింగ్ ప్రాజెక్టులను పాతికేళ్ల కిందట తన తండ్రి శ్యామసుందర శివాజీ తీసుకువచ్చారని, ఇప్పుడు ఆ ప్రాజెక్టులను మరమ్మతులు చేయించాలని కోరారు. రూ.ఆరు వేల కోట్లతో ప్రణాళిక రూపొందించిన వంశధార-నాగావళి నదుల అనుసంధాన ప్రక్రియను గత ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం నదుల అనుసంధానంపై తక్షణం చర్యలు తీసుకోవాలని సభలో కోరారు.

సీఐడీ విచారణకు ఆదేశించాలి

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తక్షణమే డిజిటల్ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగంపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చలో డిజిటల్ కార్పొరేషన్ నిధులు దుర్వినియోగంపై రవికుమార్ ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ నిధులను ఇష్టారాజ్యంగా వినియోగించినట్లు ఆరోపించారు. యాత్ర-2 సినిమా నిర్మాణానికి డిజిటల్ కార్పొరేషన్ నిధులు రూ.50 కోట్లు వినియోగించినట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైందని తెలిపారు. ప్రభుత్వ నిధులను ప్రజా అవసరాలకు కాకుండా దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులు, ఉద్యోగులపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.



చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

నిత్యం ప్రజల్లో ఉండండి

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సీఎం సూచన
- క్యాన్సర్ పేషెంట్‌కు రూ.12 లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి, ప్రజలకు అందుబాటులో ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ జర్నలిస్టు భార్య క్యాన్సర్ బారిన పడడంతో ఆమె పరిస్థితిని ముఖ్యమంత్రికి శంకర్ వివరించారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.12 లక్షల రూపాయలను సీఎం మంజూరు చేయించారు.

వేలిముద్రలు పడక.. సరకులు రాక

- పది రోజులుగా బాలలు, బాలింతలు, గర్భిణులకు అందని పౌష్టికాహారం
- ఇదీ నందికొండ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పరిస్థితి




పౌష్టికాహారం కోసం ఎదురుచూస్తున్న నందికొండ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలిలోని ఎంపీడీవో, తహసీల్దార్‌తోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న నందికొండ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పది రోజులుగా బాలలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది. సరుబుజ్జిలిలోని మండల పౌరసరఫరాల గిడ్డంగి నుంచి నందికొండ అంగన్‌వాడీ కేంద్రానికి రావాల్సిన బియ్యం, పప్పు, నూనె స్థానిక చౌక దుకాణానికి చేరాయి. అయితే ప్రతి నెలా పదో తేదీలోగా అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు సంబంధిత రేషన్ డీలర్ల ద్వారా కేంద్రాలకు సరుకులు అందాల్సిఉంది. ఎప్పటిలాగానే తమ కేంద్రానికి రావాల్సిన సరుకులు తీసుకురావడానికి నందికొండ కాలనీ అంగన్‌వాడీ కార్యకర్త జి.కళావతి డీలర్ వద్దకు వెళ్లారు. వేలిముద్రపడడం లేదని, ప్రస్తుతానికి సరుకులు ఇవ్వబోమని డీలరు తేల్చిచెప్పారు. సరుకుల కోసం డీలరు వద్దకు వెళ్లగా వేలిముద్ర సమస్య ఉందని చెప్పారని, చేసేది లేక మరో నాలుగు రోజుల తర్వాత సరుకులు గురించి అడగ్గా మళ్లీ అదేవిధంగా డీలరు సమాధానం చెప్పారని నందికొండ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కళావతి తెలిపారు. దీంతో సరుబుజ్జిలిలోని పౌరసరఫరాల గిడ్డంగి డీటీ వద్దకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రానికి రావాల్సిన సరుకులు అందలేదని తాను వెళ్లి ప్రశ్నించినట్లు చెప్పారు. నందికొండ రేషన్ డీలరుకు పదో తేదీలోపే సరుకులు పంపించినట్లు డీటీ తెలియజేశారని పేర్కొన్నారు. మళ్లీ రేషన్ డీలర్ వద్దకు వెళ్లి సరుకులు అడగ్గా వేలిముద్ర మిషన్ పనిచేయడం లేదని సీఎస్‌డీటీని కలిసి తెలియజేయాలని సమాధానం ఇచ్చారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలు 29 మంది పౌష్టికాహారం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. తాను తర్వాత వేలిముద్ర వేస్తానని, ముందుగా కేంద్రం నిర్వహణకు సరుకులు అందించాలని డీలర్‌ను అడిగినా ఫలితం లేకపోయిందని కళావతి తెలిపారు.

ఎన్టీఆర్ మునిసిపల్ పాఠశాలను దత్తత తీసుకుంటా

(ఐదో పేజీ తరువాయి)

ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను, రాష్ట్రస్థాయిలో క్రీడలకు ఎంపికైన వారిని ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛాంధ్ర ఉద్యమ స్ఫూర్తితో ప్లాస్టిక్ రహిత పాఠశాలగా ఉంచేందుకు అందరు సహకరించాలని కోరారు. 'విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ మరింత ఉన్నతంగా నడుస్తోంది. యూనిఫామ్స్ మధ్యాహ్న భోజన పథకం, భవనాలు, ఇలా అన్నింటిలో తన మార్కు చూపిస్తున్నార'ని కేంద్రమంత్రి తెలిపారు. ఇదిలా ఉండగా మునిసిపల్ పాఠశాలలోనే కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుని ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి కలిశారు. కొద్దిసేపు పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సినీనటుడు ఆర్.నారాయణమూర్తితో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

కోటబొమ్మాళి ఏఎంసీ సభ్యుల నియామకం

(ఐదో పేజీ తరువాయి)

పి.సునీత, డి.పద్మావతి, ఎ.గౌరి, ఎం.హేమసుందరరావు, బి.అప్పల స్వామి, సీహెచ్ భీమారావులను నియమిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే పీఏసీఎస్ కోటబొమ్మాళి అధ్యక్షుడు, టెక్కలి ఏడీఏ, కన్నేవలస సర్పంచ్, శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కూడా సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిపాటు బాధ్యతలు చేపడుతుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ స్పష్టం చేశారు.

బెర్ములు వేశారు..



రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేస్తున్న దృశ్యం

గార రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వమరవల్లి పంచాయతీ హుకుంపేట రోడ్డుకు ఇరువైపులా బెర్ములను ఎట్టకేలకు వేశారు. ఈ నెల 11న 'ఆంధ్రజ్యోతి'లో 'రోడ్డు వేశారు.. బెర్ములు మరిచారు' శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. తక్షణం రోడ్డుకు ఇరువైపులా బెర్ములు వేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేసి చదును చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల అందజేత

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు సంబంధించి ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు హాజరుకాగా వైద్య పరీక్షలు చేసి 150 మందికి ఉపకరణాలు అవసరమని గుర్తించామని ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం తెలిపారు. వీరికి త్వరలో న్యూఢిల్లీకి చెందిన అలంక్ సంస్థ ఆధ్వర్యంలో పరికరాలు అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 8 మందికి ట్రై సైకిళ్లు, 11 మందికి వీల్ చైర్లు, 8 మందికి వినికిడి యంత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ డాక్టర్ శశిభూషణ్, ఈఐసీవో కోఆర్డినేటర్ గోవిందరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఉమా, సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 112 మంది ఎంపిక


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వర్ణభారతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విప్రో, అమేజాన్, కాన్‌సెంట్రిక్, జొమాటో, డబ్ల్యూఎస్ఎస్ తదితర కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాలో 112మంది నిరుద్యోగ యువతీ యువకులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ తులసీదాస్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు కె.సందీప్, జయప్రకాష్, సీహెచ్ రాము, శ్రీనివాస్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై ముగిసిన వర్క్‌షాప్

ఎచ్చెర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో డ్రోన్ టెక్నాలజీపై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. రోజీస్ వర్చువల్ సొల్యూషన్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. డ్రోన్ తయారీ, వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు బి.జానకి రామయ్య, కె.నారాయణరావు, సంస్థ రీసోర్స్ పర్సన్ చైతన్య పాల్గొన్నారు. అలాగే ఇండస్ట్రియల్ ట్రైనింగ్ రోజీస్ వర్చువల్ సొల్యూషన్‌తో పాలిటెక్నిక్ ఒప్పందం కుదుర్చుకుంది.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

జి.సిగడాం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో బాలగోపి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామిత్ర, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, ఇంటి పన్ను వసూలు, పారిశుధ్యం మెరుగుదల తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వామిత్వ గ్రామకంఠ రీ సర్వే సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు.

ఎరువుల కోసం రైతుల అవస్థలు

గార రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత రైతులను వెంటాడుతోంది. ఎరువులు లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, దీంతో ఏంచేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సత్యసాయి ట్రేడర్స్‌కు 480 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల రైతులు అక్కడికి చేరుకున్నారు. ఎరువుల కోసం తోపులాట చోటు చేసుకుంది. దీంతో యూరియా విక్రయాన్ని నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఏవో పద్మావతి అక్కడికి చేరుకుని కేవలం గార గ్రామానికి చెందిన వారికి మాత్రమే ఎరువులు ఇవ్వాలని సదరు వ్యాపారికి ఆదేశించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇంత వరకు ఎక్కడకు ఎరువుల వచ్చినా మండల వ్యాప్తంగా ఆ సమయానికి అక్కడకు వచ్చిన రైతులకు పంపిణీ చేశారని, ఇప్పుడు కొత్తగా ఈ నిబంధన పెట్టడం ఏమిటని ఆమెను నిలదీశారు. చేసేదేమీలేక సిబ్బంది, వ్యాపారి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో రైతులు నిరాశచెందారు.

రాష్ట్రస్థాయిలోనూ రాణించాలి


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో శుక్రవారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 300 మంది బాలబాలికలు తరలివచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ముఖ్యసలహాదారు పి.సుందరరావు, ఎస్‌జేఫ్ కార్యదర్శి బీవీ రమణ, సాఫ్ట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బి.సురేష్‌కుమార్, ఎం.ఆనంద్‌కిరణ్, ఎ.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

లావేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో స్థానిక జడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పి.జగన్నాథం తెలిపారు. వివిధ విభాగాల్లో ఎంపికైన విద్యార్థులను హెచ్ ఎంతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, రాంబాబు అభినందించారు.

ఘనంగా విశ్వకర్మ మహోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చంపాగల్లి వీధిలో విశ్వకర్మ భగవానుని పంచమపూజ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం మహిళలు దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సోపింటి తారకేశ్వరరావు, కడారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కుల దూషణపై దర్యాప్తు

రణస్థలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లోటస్ మహిళా గ్రూపు లీడర్‌ను మార్చే ప్రయత్నంలో సంఘ సభ్యుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ గ్రూపులో కమల అనే మహిళ ఎం.సుజాతను కులం పేరిట దూషించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ కేసుపై శుక్రవారం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దర్యాప్తు చేపట్టారు.

నిరుపయోగం

మండలంలోని అతిపెద్ద మత్స్యకార గ్రామమైన బందరువానిపేటలో 8 ఏళ్ల కిందట 25 సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు గాను వీటిని ఏర్పాటు చేసినా వీటి నిర్వహణకు ఏర్పాట్లు చేయకపోవడంతో అప్పటి నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. కనీసం నీటి సదుపాయం లేక వీటిని వినియోగించ లేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

-గార


బందరువానిపేటలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రమాదకరం

పురుషోత్తపురం పాత చెక్‌పోస్ట్ జాతీయ రహదారి డివైడర్ మధ్యలో ఉన్న చెట్టు, షెడ్‌తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న చెక్ పోస్టు ఉన్నప్పుడు వాహనాలు నెమ్మదిగా వెళ్లేవని, ప్రస్తుతం దానిని ఎత్తి వేసినా ఆ షెడ్ తొలగించకపోవడంతో వాహనాలు అతి వేగంగా వస్తున్నాయని, దీంతో రాత్రి సమయాల్లో కనిపించకపోవడంతో ఇబ్బంది కరంగా ఉందని వారంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

-ఇచ్ఛాపురం


రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న చెట్టు, షెడ్డు

కేంద్రమంత్రి వస్తున్నారని..

● పారిశుధ్య సిబ్బంది హడావుడి

అరసవల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పట్టణంలో పర్యటిస్తున్నారన్న సమాచారంతో నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది హడావుడి చేశారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ కార్గిల్ విక్టరీ పార్కు, ఏడురోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించనున్నారని తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్ జల్లారు. ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో కూడా మొక్కలను తొలగించి, పారిశుధ్య పనులు అప్పటికప్పుడు చేయడం కనిపించింది. సార్ వచ్చే సమయం దగ్గరపడుతోందని, వేగంగా శుభ్రం చేయండంటూ పారిశుధ్య సిబ్బందిని సంబంధిత అధికారులు ఆదేశించడం కనిపించింది. పెద్ద నాయకులు, అధికారులు వస్తేనే ఇలా శుభ్రం చేస్తారా... లేకుంటే చేయరా అంటూ పట్టణ ప్రజలు గుసగుసలాడుకున్నారు.


కార్గిల్ విక్టరీ పార్కు వద్ద పారిశుధ్య పనుల్లో..


ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో..

నవరాత్రి ఉత్సవాలకు శుభరాట

సోంపేట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) ఎకువూరు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం శుభరాట వేశారు. గ్రామానికి చెందిన బడే ఈశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రవీణ్ పాణిగ్రాహి ఈ కార్యక్రమం చేపట్టారు.

'గణితదీప్తి'ని వినియోగించుకోండి

ఆమదాలవలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు 'గణితదీప్తి' ఎంతో ఉపయోగంగా ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కేపీ రాములు అన్నారు. ఆంధ్రప్రదేశ్ మేథమేటిక్స్ ఫోరం రూపొందించిన స్టడీ మెటీరియల్ 'గణితదీప్తి'ని శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా దీనిని రూపొందించారన్నారు. కార్యక్రమంలో గణితశాస్త్ర ఉపాధ్యాయులు షేక్‌షావలి, చంద్ర మనోహర్, ఇన్‌చార్జి హెచ్ఎం పైల రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతితల్లీ ఆరోగ్యంగా ఉండాలి

రణస్థలం, సెప్టంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి తల్లీ ఆరోగ్యంగా ఉండాలని, పౌష్టికాహారం సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిన్నింటి వెంకటభానోజి నాయుడు అన్నారు. 'సుపోషిత్ భారత్ సక్షం భారత్'లో భాగంగా శుక్రవారం రణస్థలంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి: శ్రీకాకుళం రూరల్ మండలం గూడెం గ్రామంలో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' శుక్రవారం నిర్వహించారు. సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి లిల్లీ ఆధ్వర్యంలో పోషకాహారం, రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమణీయ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాళీమాత సంబరం

కవిటి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా బొరివంకలో శ్రీకాళీమాత సంబరం ఘనంగా నిర్వహించారు. కాళీమాతను గ్రామంలోకి ఆహ్వానం పలుకుతూ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పెట్రోలింగ్ గస్తీ

● 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పెట్రోలింగ్ గస్తీ ని పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శ్రీకాకుళం నుంచి కాశీబుగ్గ వరకు హైవే పెట్రోలింగ్ వాహనాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టాలని, అనుమానితులను ప్రశ్నించాలన్నారు. హైవేపై వేగంగా వెళ్లే వాహనాలు, అనుమానాస్పద వాహనాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేసేవారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, పశువుల అక్రమ రవాణా వాహనాలను గుర్తించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డుపై ఇరువైపులా లారీలు, ఇతర భారీ వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సమస్యలను పరిష్కరించాలి

● విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

పాత శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీటీ రోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ నేతలు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు సంస్థల్లో ఉన్న అన్ని ట్రస్టులను బలోపేతం చేసి, మూడు నెలలకు ఒకసారి ట్రస్టు అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. పదేళ్ల సర్వీసు నిండిన వారందరికీ 2018 రివిజన్‌లో మంజూరు చేసిన సర్వీస్ ఇన్సెంటివ్ పునరుద్ధరించాలన్నారు. జిల్లాలో సుమారు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న 464 మంది సర్వీసులను ఇప్పటికీ క్రమబద్ధీకరించలేదన్నారు. ఈనెల 22న సర్కిల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మాస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఏసీ జిల్లా చైర్మన్ ఎంవీ గోపాలరావు, కన్వీనర్ కె.రమేష్, గురునాథ నాయుడు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ శివకుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం చేపలవీధి మున్సిపల్ హైస్కూల్‌లో ప్లాస్టిక్ ఎక్స్చేంజ్ మేళాను నిర్వహించారు. ఇంటిలో వృథాగా పడేసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బాటిల్స్‌లో నింపి నగరపాలక సంస్థకు అందిస్తే వాటికి బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, పుస్తకాలు బహుమతిగా అందిస్తామన్నారు.

రైతులకు తక్కువ ధరలకే దాణా, పనిముట్లు

● డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్

అరసవల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సిన పశువుల దాణా, టార్పాలిన్లు, వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలకే అందించనున్నామని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ అన్నారు. అరసవల్లి రోడ్డులోని ప్రధాన కార్యాలయంలో 69వ ప్రథమ మహాజన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. సహకార సంఘాలు పరస్పరం సహకరించుకుంటేనే వ్యాపారం విస్తరించి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు యూరియా కోసం ఇఫ్కో కంపెనీతో చర్చలు జరుపుతున్నామన్నారు. డీసీఎంఎస్ అభివృద్ధికి ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ హాళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణల నివారణకు ప్రహరీలు నిర్మించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ శివాల సూర్య నారాయణ, బిజినెస్ మేనేజర్ జగ్గు నాయుడు, వ్యవసాయ సహకార సంఘాల ఇన్‌చార్జిలు, డీసీసీబీ సీఈవో, మత్స్య సంఘాల చైర్మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబరు 13 నుంచి సత్యసాయి పరబ్రహ్మోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా 100వ పుట్టిన రోజు సందర్భంగా సత్యసాయి పరబ్రహ్మోత్సవాలను నవంబరు 13 నుంచి 23 వరకు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులను ఆహ్వానించామన్నారు. ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయనున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పదివేల మంది భక్తులు సత్యసాయి పరబ్రహ్మోత్సవ పర్తియాత్రలో పాల్గొంటారని సంఘం జిల్లా అధ్యక్షుడు సూర రామారావు ఆ ప్రకటనలో తెలిపారు.

న్యూస్ బాక్స్

చీడపీడల నివారణపై అవగాహన

ఆమదాలవలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వై.సురేష్ రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం నిమ్మ తొర్లాడలో వరి పంట పొలాల క్షేత్ర సందర్శన చేపట్టారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా ఖరీఫ్-2025లో వరి పంటకు సోకే జీడపీడల పరిస్థితిని పరిశీలిస్తున్నామన్నారు. చీడపీడలు ఎక్కువగా వ్యాప్తిచెందితేనే రసాయన మందులను వాడాలని సూచించారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

కవిటి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో-2 ఎస్.రామకృష్ణ తెలిపారు. బాలికా శిశు సంరక్షణ అనే అంశంపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

'నెట్'లో శ్యామ్ ప్రతిభ


శ్యాంసుందరరావు

సోంపేట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం మత్స్యకార గ్రామానికి చెందిన రిక్క శ్యామ సుందర రావు జాతీయ స్థాయిలో నిర్వహించిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ (నెట్)లో ఆరో ర్యాంకు సాధించాడు. ఈయన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్యామ్ ప్రాథమిక విద్య ఎర్రముక్కాం హైస్కూల్, ఇంటర్, డిగ్రీ హరిపురంలోని ప్రైవేటు కళాశాల, ఆంధ్రాయూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమెస్ట్రీ చేశాడు. ప్రస్తుతం పీహెచ్‌డీకి సంబంధించి నెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచాడు. గత ఫిబ్రవరిలో గేట్ రాసి క్వాలిఫై అయిన శ్యామ్ మంచి ర్యాంకు సాధించడంపై గ్రామస్థులు అభినందించారు.

IN THE HON'BLE COURT OF JUNIOR CIVIL JUDGE- PALASA

IA 177/2024, 136/2024 in OS 34/2004

Chokkara Baburao ... Plaintiffs
Chokkara Krantibai

V/s

Chokkara Chinnarao S/o Late Babayya ... Defendant-2

Komara Kamalakar S/o Satyarao ... Defendant-5

Where as the above named plaintiffs filled the suit against both of you before the Hon'ble court for suit for Prilimanary Injection and despite of repeated summons issued by the Hon'ble court. But you are avoiding to take summons as such summons are ordered by publication on for your appearance in the above matter on 25.09.2025 at 10.30 A.M either on person or through an advocate. Failing which the matter shall be determined in your absence as per law.

By order of the court
KOMARA DEVERAJU, B.L
Advocate
Palasa - Srikakulam (Dist)

Palasa
Dt. 20.09.2025

లారీలతో నష్టం వచ్చి.. అప్పులపాలై.. వ్యక్తి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీ 17వ వార్డు సంతపేటకు చెందిన కర్రి నాగరాజు(46) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్‌ఐ ముకుందరావు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజుకి 21 ఏళ్ల కిందట బెల్లుపడ కొండివీధికి చెందిన కృష్ణవేణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. మూడు లారీలతో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసుకునేవాడు. నాలుగేళ్ల కిందట రెండు లారీలు ప్ర మాదానికి గురై పాడయ్యాయి. ఉన్న ఒక్క లారీకి డ్రైవర్‌ను పెట్టుకుని నడిపేవాడు. ఇదే క్రమంలో జనసేన పార్టీలో కార్యకర్తగా తిరిగే వాడు. ఉన్న లారీతో కూడా సరైన వ్యాపారం లేకపోవడంతో విక్రయించాడు. అ యితే ఆర్థికంగా బాగా చితికిపోయి అప్పుల పాలయ్యాడు. ఈ మూడు లారీల కారణంగా సుమారు రూ.30 లక్షల వరకు అప్పులపాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త ఆర్థిక ఇబ్బందులను చూసిన భార్య కృష్ణవేణి తాను సభ్యురాలిగా ఉన్న డ్వాక్రా గ్రూపు నుంచి రూ.6 లక్షలు లోన్ తీసుకుంది. అయితే ఆ లోన్ సక్రమంగా తీర్చలేకపోవడంతో మనస్తాపం చెందిన నాగరాజు ఇంటిలోని మేడపై గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పురుగుమందు తాగి ఒకరు..

జలుమూరు (సారవకోట), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నవతల గ్రామానికి చెందిన వాడారి అప్పన్న(49) శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మద్యానికి అలవాటుపడిన అప్పన్న ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, అప్పన్న భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా అప్పన్నకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆ వివాహిత చనిపోయింది..


చికిత్స పొందుతున్న రూపవతి(ఫైల్)

పలాస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విభేదాల కారణంగా భర్త తనకు దూరమవుతాన్నడనే మనస్తాపంతో గురువారం పురుగుల మందుతాగి పోలీసుస్టేషన్ వద్ద కుప్పకూలిపోయిన వివాహిత రాపాక రూపవతి చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించించినట్టు తెలిపారు. గొల్లమాకనపల్లి గ్రామానికి చెందిన రూపవతికి మందస మండలం లింబుగాం గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు భానుతేజతో రెండున్నరేళ్ల కిందట వివాహం జరిగింది. తన భర్తతో పాటు అత్తమామలు వేధిస్తున్నారని, దాడి కూడా చేశారని రూపవతి ఫిర్యాదు చేసింది. అనంతరం మార్కెట్‌కు వెళ్లి పురుగుల మందు కొనుగోలు చేసి ఆమె అక్కడే తాగేసింది. అనంతరం పోలీస్టేషన్‌కు వచ్చి బయటే కుప్పకూలిపోయింది. దీంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టే సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం రైలు నిలయం సమీపాన గల ఫ్లైఓవర్ కింద శుక్రవారం ఉదయం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పలాస జీఆర్పీ పోలీసు సోమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. మృతుడి వయస్సు 50నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎడమకాలి పాదానికి బ్యాండేజ్ కట్టు ఉందని, మెడలో తాయత్తు, తెలుపు, నీలం కలర్ గడులూ ఉన్న తువ్వాలు, నలుపు, తెలుపు గీతలు కలిగిన లుంగి, తెలుపు రంగు బాడి ధరించి ఉన్నాడన్నారు. ఇతడి వివరాలు తెలిసినవారు 94922 50069 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

తిలారు రైల్వేస్టేషన్ సమీపంలో ఒకరు..

జలుమూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. పలాస నుంచి ఆమదాలవలస వెళ్లే రైలు ఢీకొన్నట్టు ఆయన తెలిపారు. మృతుడి వయసు 60 ఏళ్లు ఉండొచ్చన్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో భద్రపరచినట్టు ఆయన తెలిపారు. వివరాలు తెలిసినవారు రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హరిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మందస మండలం బిన్నల జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారిపై ప్రమాద సూచికలు పెట్టి ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన వాహనాలు నిలిపి సిబ్బంది క్లీనింగ్ పనులు చేస్తున్నారు. ఇంతలో అధిక వేగంతో వస్తున్న సిమెంట్ ట్యాంకరు లారీ వాహనాలపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ రసూల్‌తోపాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పనులు చేస్తున్న మరో ముగ్గురు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను హరిపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘ సేవకుడు చిన్నాచారి మృతి


చిన్నాచారి(ఫైల్)

పలాస రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన సంఘ సేవకుడు, ప్రకృతి ప్రేమికుడు కొత్తపల్లి చిన్నాచారి(55) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఈ ప్రాంతంలో మంచి గుర్తింపు ఉంది. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, కొండల ప్రాంతంలో చెట్ల గింజలను విసిరి మొక్కల పెంపునకు ఎంతో కృషి చేశారు. లొద్దభద్ర నుంచి సవరగోవిందపురం వరకూ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి వాటి పర్యవేక్షణ బాధ్యతలు తీసుకున్నారు. ప్రధాన కూడళ్లల్లో బస్సు షెల్టర్ల వద్ద మొక్కలు నాటారు. విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి, మహాదేవపురం స్వయం భూలింగేశ్వర ఆలయం అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఏటా సంక్రాంతికి గిరిజనులకు దుస్తులు, పండ్లు, నగదు అందించేవారు. యువజన సంఘాల బలోపేతానికి, కళారంగం అభివృద్ధికి తనవంతు సాయపడేవారు. కాశీబుగ్గ లలిత కళారంజని గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. చిన్నాచారి మృతికి గిడుగు రామమూర్తి కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు, సినీ, టీవీ, రంగస్థల నటుడు డాక్టర్ కుమార్ నాయక్, కళాకారులు శ్రీనివాస బాబ్జీ, కవులు శివజ్యోతి, బూర్లి కోటేశ్వరరావు శుక్రవారం సంతాపం తెలిపారు.

చోరీపై కేసు నమోదు

కొత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్లెమ్మ పంచాయతీ పరిధి మహాసింగి గ్రామంలో గల ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల సమీపంలో పార్కింగ్ చేసిన లారీ బ్యాటరీలు, టైరు, 200 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్టు అదే గ్రామానికి చెందిన బొందిల వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. దొంగతనానికి పాల్పడినవారి గురించి గాలిస్తున్నట్టు తెలిపారు.

సరియాపల్లిలో అపరిశుభ్రత

- అధ్వానంగా రహదారులు
- కానరాని డ్రైనేజీలు
- తప్పని తాగునీటి అవస్థలు
- పట్టించుకోని అధికారులు


సరియాపల్లిలో రహదారి దుస్థితి




నిరుపయోగంగా మారిన బోరు, కుళాయి పాయింట్

పలాస రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పలాస మండలం గరుడఖండి పంచాయతీ సరియాపల్లి, సరియాపల్లి కాలనీలో అపరిశుభ్ర వాతావరణంతో పాటు రహదారులు బురదమయమైంది. గ్రామ రహదారులు అపరిశుభ్రంగా ఉండడం, మురుగునీరు నిల్వ ఉండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామంలో కనీసం తాగునీరు కూడా సరఫరా కావడం లేదు. కుళాయిలు, చేతిపంపు బోరు ఉన్నా నిరుపయోగమే. ఈ గ్రామం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్నారు. గత పదిరోజులుగా అదికూడా లేదు. గ్రామంలో వర్షాలకు రహదారులంతా బురదమయమైంది. డ్రైనేజీలు లేకపోవడం, పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్గంధంగా మారింది. అదే విధంగా ఫ్లైఓవర్‌కు ఆనుకొని ఉన్న సరియాపల్లి కాలనీలో కూడా ఇదే దుస్థితి నెలకొంది. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బోరు ఉప్పునీరు వస్తుండడంతో వాటిని వాడుకలకు మాత్రమే వినియోగించుకుంటున్నారు. నీటి ట్యాంకుకు దిమ్మవేశారే గాని ఇప్పటి వరకూ కాలనీలో నీటి ట్యాంకు నిర్మించలేదు. దీంతో పాటు కుళాయిలు, గొట్టాలు వేసినా నీటిని అందిం చలేదని ఆ వేదన వ్యక్తం చేశారు. కాలనీవా సులంతా అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ఫలితం లేదని, దిక్కు లేక తాగునీటిని బయటనుంచి కొనుగోలు చేస్తున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామస్థులంతా కోరుతున్నారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు సిద్ధం కావాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొత్తమ్మతల్లి ఉత్సవాలకు అధికారులంతా సన్నద్ధంకావాలని, పక్కాగా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను ఫోన్‌లో దిశానిర్దేశం చేశారు. ఆలయ ఉత్సవాలు వందేళ్లు పూర్తవుతుండడంతో అంగరంగ వైభవంగా సంబరాలు నిర్వహించాలన్నారు. ఒడిశా, చత్తీస్‌గడ్ నుంచి కూడా భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలికాప్టర్ రైడ్, లేజర్ షోలు నిర్వహిస్తున్నామని వాటికి సాంకేతిక సంబంధిత విషయాలపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఏర్పాట్లను టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఉచిత, రూ.20, రూ.50ల క్యూలైన్లపై సీఐ శ్రీనివాసరావును, ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ అప్పలరాజు, ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ గోవింద్, టీడీపీ నాయకులు బోయిన రమేష్, గ్రామపెద్దలు పెద్ద గోవింద్ తదితరులు ఉన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన

పలాస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం మధ్యాహ్నం డిపో మేనేజర్ వీఎస్ఎస్ నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలాస నుంచి పార్వతీపురం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని పాతపట్నానికి చెందిన నారాయణమూర్తి కోరారు. ఈదుపురం నుంచి విశాఖ వెళ్లేందుకు ప్రతి రోజూ వేకువ జామున 4 గంటలకు బస్సు వేయాలని ఆ ప్రాంతానికి చెందిన మాలతి, అప్పారావు కోరారు. నువ్వలరేవు గ్రామంలోపలకు బస్సు రావడం లేదని, కిల్లోయి బస్సు సిబ్బంది ప్రవర్తన సక్రమంగా లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. సాయంత్రం, రాత్రి సోంపేట, ఇచ్ఛాపురానికి బస్సు వేయాలని ప్రయాణికులు ఫోన్‌లో డీఎంను కోరారు. డిపోమేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికుల ఫిర్యాదులు పరిగణలోకి తీసుకొని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుల కుటుంబాలకు శివాజీ పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ మంత్రి శివాజీ

హరిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మందస మండలం బుడార్సింగి, చికిడిగాం, కురడాలు, బాలిగాం, మొగిలిపాడు, లింబుగాం తదితర గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ శుక్రవారం పరామర్శించారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, వాసు, సంతోష్ గౌడ, భాస్కరరావు ఉన్నారు.

- వజ్రపుకొత్తూరు: చినకొత్తూరు గ్రామానికి చెందిన అడ్ల తారకేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి గౌతు శివాజీ శుక్రవారం పరామర్శించారు. అలాగే వజ్రపుకొత్తూరుకు చెందిన రచ్చ ఈశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకులు బుల్లో శశిభూషన్, అరసవల్లి ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ, బాలకృష్ణ, కుత్తుం కృష్ణ ఉన్నారు.

మహిళలంతా అక్షరాస్యులుగా మారాలి

పలాస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి స్వయంశక్తి మహిళలంతా అక్షరాస్యులుగా మారాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణలో పొదుపు సంఘాల రిసోర్స్ పర్సన్లు, వలంటరీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పదిమందితో కలిపి ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి ప్రతి రోజూ శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వయోజనవిద్య, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

12 అడుగుల కొండచిలువ హతం



కొత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహాసింగి గ్రామ పరిసరాల్లోకి శుక్రవారం వచ్చిన సుమారు 12 అడుగల కొండచిలువను స్థానికులు గుర్తించి చంపేశారు. ఇళ్ల పెరటలోకి వచ్చిన ఈ కొండచిలువను చూసి స్థానికులు పరుగులు తీశారు. అనంతరం తేరుకుని కర్రలతో కొట్టి చంపేశారు.

ఆదాయం వచ్చే పంటలు వేసుకోవాలి

మెళియాపుట్టి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని నాబార్డు అధికారి ఎం.కృష్ణ తెలిపారు. శుక్రవారం ఇలాయిపురం, నేలబొంతు గ్రామాల్లో బ్రెడ్స్ ఆధ్వర్యంలో గిరిజనులకు మొక్కలు అందజేశారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. రైతులు కోళ్ల పెంపకం, కూరగాయల సాగు వల్ల ఆదాయం వస్తుందన్నారు, కార్యక్రమంలో బ్రెడ్స్ ప్రతినిధులు సాంబమూర్తి, జగన్నాథ బెహరా, రమణ, కార్యదర్శి నాయుడు, తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ నిమజ్జనం


గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామంలో కొలువు తీరిన విశ్వకర్మ నిమజ్జనం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పంచవృత్తుల సేవా సహకార సంఘం సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలు సందర్భంగా మూడో రోజు నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. లింగాలవలస నుంచి చల్లవానిపేట కూడలి వరకు గ్రామోత్సవం నిర్వహించి రాణ వద్ద గల వంశధార ఎడమ కాలువలో నిమజ్జనం చేశారు.

తాపీ ధర్మారావు కృషి మరువలేనిది


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాతపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష ఉద్యమానికి తాపీ ధర్మారావు చేసిన కృషి మరువలేనిదని హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో తాపీ ధర్మారావు జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాపీ ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నల్ల తారక రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల మైదానం చదును

జలుమూరు (సారవకోట), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు ధర్మాన తేజకుమార్ తర్లి గిరిజన బాలువ ఉన్నత పాఠశాల మైదానం స్వంత నిధులతో చదును చేయించారు. ఈ పాఠశాల ఆట స్థలం వర్షం పడితే నీరు నిల్వ ఉండి విద్యార్థులు అవస్థలు పడేవారు. ఈ విషయం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్ దృష్టికి వచ్చింది. దీంతో రూ.70 వేలు వెచ్చించి మైదానంలో మట్టి, కంకర వేయించి చదును చేయించారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యయులు, తల్లిదండ్రులు కృతజ్ఞత తెలిపారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

పాతపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోడీ పాలనలోనే దేశం సమగ్రాభివృద్ధి సాధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబరు 2వతేదీ వరకూ 15రోజులపాటు సేవా పక్షోత్సవాల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 90 మంది రక్తదానం చేసినట్టు తెలిపారు. పార్టీ నాయకులు పడాల షన్ముఖరావు, నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

హిరమండలం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావాలని టెక్కలి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి అలివేలు మంగమ్మ అన్నారు. శుక్రవారం హిరమండలం మేజర్ పంచాయతీలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది కచ్చితంగా ఉదయం 10.30 గంటలలోగా ఆన్‌లైన్ హాజరు నమోదు చేసుకోవాలన్నారు. వరుసగా మూడు రోజులు ఆలస్యంగా వస్తే ఒక ఆబ్సెంట్ వేయాలని ఎంపీడీవో కాళీప్రసాదరావును ఆదేశించారు. ఈవో ఎం.భాస్కరావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నేడు పచ్చదనం-పరిశుభ్రత

పోలాకి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పోలాకి మండల కేంద్రంలో పాల్గొంటారని ఎంపీడీవో రవికుమార్, సూపరింటెండెంట్ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ బోధనలకు శిక్షణా తరగతుల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని, అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతారని వారు చెప్పారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి అందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

సత్యవరం విద్యార్థుల ప్రతిభ

నరసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఇటీవల విజయవాడలో నిర్వహించిన గట్కా పోటీల్లో సత్యవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ పోటీల్లో 8 మంది విద్యార్థులకు బంగారం పతకాలు, 12 మందికి రజత పతకాలు, ముగ్గురు కాంస్య పతకాలు సాధించారు. వీరిని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అభినందించారు. ఎంపీపీ ఆరంగి మురళీధర్, ఎంఈవో పేడాడ దాలినాయుడు, విద్యాకమిటీ చైర్మన్ శాంతానాగరాజు, జగదీష్‌బాబు, హెచ్‌ఎం వకులా రత్నమాల, పీడీ జ్యోతిరాణి, ఉపాధ్యాయులు కేశవరావు, లక్ష్మణరావు, లీలా పాల్గొన్నారు.


దమర సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్క తీగలు

పొంచిఉన్న ప్రమాదం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టెక్కలి నుంచి జి.జగన్నాథపురం వరకు వచ్చే గూడెం ఫ్యూడర్‌లో విద్యుత్ వైర్లకు పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అధికంగా దమర నుంచి జగన్నాథపురం వరకు వచ్చే లైన్‌లో మొక్కలు వైర్లకు తగలడంతో చిన్నపాటి గాలి వీచినా విద్యుత్‌కు అంతరాయం కలుగుతుండడంతో విద్యుత్ వినియోగదార్లు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని కొరుతున్నారు.

విశాఖ ఏడీఆర్ఎంకు అభినందన

పలాస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ అడిషనల్ డివిజన్ రైల్వేమేనేజర్ (ఏడీఆర్ఎం)గా బాధ్యతలు చేపట్టి వచ్చిన కుందు రామారావుకు పలాస రైల్వే స్టేషన్‌లో ఆయన నివాసం ఉంటున్న జీఎంఈ కాలనీ వాసులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక జీఎంఈ కాలనీలో రామారావు కుటుంబం 10ఏళ్లుగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆయన విశాఖజోన్‌కు ఏడీఆర్ఎంగా పదోన్నతి లభించింది.

సకాలంలో పరిష్కరించాలి

పలాస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నేరుగా బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

బారువలో అగ్ని ప్రమాదం

సోంపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బారువ గ్రామానికి చెందిన తెప్పల ముకుందరావు ఇంట్లో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4.50 లక్షల విలువైన నగదు, దుస్తులు, డాక్యుమెంట్లు కాలిపోగా ఇంటి పైకప్పు పాడైనట్లు బాధితుడు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకాధికారి సూర్యారావు, సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

సమస్యలు పరిష్కరించండి

నరసన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే థర్డ్‌పార్టీ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.సూర్యనారాయణ, జేవీ రమణ పాల్గొన్నారు.

జీవో నెం.77 రద్దు చేయాలి

కాశీబుగ్గ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 77 రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా దర్నా చేపట్టారు. తక్షణమే 6400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో 2020, 21, 22, 23 సంవత్సరాల్లో చదువుకున్న విద్యార్థులకు ఇప్పటికీ ఆయా కళాశాలలు సర్టిఫికేట్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సోమేష్, రవికుమార్, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు బహిరంగ వేలం

టెక్కలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): టెక్కలి గ్రామ పంచాయతీ పరిధిలో 87 దుకాణాలకు పంచాయతీ యంత్రాంగం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఎల్‌పీవో ఐవీ రమణ, ఈవోపీఆర్డీ సింహాద్రి, కార్యదర్శి ఏవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. చిన్నబజారులో ఏడు షాపులు, పంచాయతీ కార్యాలయం వద్ద ఎనిమిది, పాతబస్టాండ్‌లో ఐదు, చేపల మార్కెట్ దరిలోని 30 షాపులకు వేలం పాటలు నిర్వహించారు.

సందడిగా డివిజన్ స్థాయి క్రీడలు

టెక్కలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికల క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఈ క్రీడలను ప్రారంభించారు. డివిజన్ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు వైశేఖర్‌బాబు, బాడాన నారాయణరావు తెలిపారు. 58 పాఠశాలల నుంచి 425మంది క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనార్దనరావు, కృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హరిపురం/మందస, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని అంబుగాం, హరిపురం, ఉద్దానం ఫీడర్లలో చెట్ల కొమ్మలు, ముళ్లపొదలు తొలగింపు చేపట్టనుండడంతో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ యజ్ఞేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

- సంతబొమ్మాళి: నౌపడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో నౌపడ, హనుమంతునా యుడుపేట, మూలపేట, మేఘవరం, భావనపాడు, యామలపేట, మర్రిపాడు, ఆకాశలక్కవరం, ఎం.సున్నాపల్లి, ఇజ్జువరం గ్రామ పంచా యతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.
- నందిగాం: నందిగాం సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్‌కు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ నర్సింహకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నర్సిపురం, దిమిలాడ, లఖిదాసుపురం, శాసనాం, బూరగాం రైస్‌మిల్లులు, ఇటుకల పరిశ్రమ, లచ్చన్నపేట, మాకవరం గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాను నిలిచిపోతుందన్నారు.
- సోంపేట: కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏడీఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. దీంతో కొర్లాం, జీడిపుట్టుగ, బేసిరామచంద్రాపురం, సందికొత్తూరు, పాలవలస, మామిడిపల్లి, రాజాం, సిరిమామిడి, ఎర్ర ముక్కాం, గొల్లూరు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
- గార రూరల్: తూలుగు సబ్‌స్టేషన్ పరిదిలోని గార, జల్లువలస మీదుగా బూరవెల్లి వరకు ఉన్న గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ కమల్ హాసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంశధార నదీ తీరంలో నిర్మించిన ఎత్తిపోతల పథకానికి ప్రత్యేక విద్యుత్‌లైన్ వేస్తున్నందున సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.
- రణస్థలం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనుండడంతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ యోగేశ్వరరావు పేర్కొన్నారు. దీంతో జేఆర్ పురం, రామతీర్థం జంక్షన్, పాత పెట్రోల్ బంకు వరకూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
- ఇచ్ఛాపురం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. దీంతో బెల్లుపడ, బెల్లుపడ కాలనీ, కండ్రవీధి, గొల్లవీధి, వీకే పేట, రత్తకన్న, దాసన్నపేట, కస్పావీధి, డబ్బూరి వీధి, ఏఎస్ పేట, పురుషోత్తపురం, మండపల్లి, కేదారిపురం, ముచ్చింద్ర ఈదుపురం, డొంకూరు, కేశుపురం, కొళిగాం, బిర్లంగి, తేలుకుంచి, హరిపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపి వేయనున్నట్టు తెలిపారు.
- పాతపట్నం: ఆర్ఎల్ పురం, రౌతుపురం అనంతగిరి బైదలాపురం సున్నాపురం కొమ్మలగూడ నల్లకొత్తూరు మామిడిపల్లి పూతికగూడ గొంటిపేట బూర్జిగూడ ఏఎస్ కవిటి చాకిపల్లి నల్లబొంతు చిన్నకింగ స్టువర్టుపేట గ్రామాలకు శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ నర్సింహరావు తెలిపారు.

కవిటి సబ్ స్టేషన్ పరిధిలో రేపు

కవిటి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కవిటి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. కపాసుకుద్ది ఫీడర్‌లో 11 కేవీ విద్యుత్ పనులు చేపట్టనుండడంతో పుటియాదల, కపాసుకుద్ది, ముత్యాలపేట, కొరికానపుట్టుగ గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.